వైద్య మాస్టర్ డిగ్రీకి దరఖాస్తుల ఆహ్వానం

వ్యవసాయ యూనివర్సిటీ, ఫిబ్రవరి 25: వైద్య రంగంలో మాస్టర్ డిగ్రీపై ఆసక్తి, అర్హత గల వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అసిస్టెంట్ మేనేజర్, పీఆర్ఓ డా. టి. శివనాగేశ్వర్ రావు తెలిపారు. కాళోజీ నారాయణ రావు వైద్య విజ్ఞాన విశ్వవిద్యాలయానికి అనుబంధ సంస్థగా వెలసి, రెండేళ్లు పూర్తి అయిన ఐఐపీ ఎంపీహెచ్ హెల్త్‌లో మాస్టర్ డిగ్రీ ప్రవేశ పరీక్ష మార్చి 16వ తేదీన నిర్వహించనున్నది. ఎలాంటి వయో పరిమితి లేకుండా ఈ కోర్సు చేయవచ్చు. డిగ్రీలో ఎస్సీ, ఎస్టీ 30శాతం మార్కులు పొందిన వారు, ఇతరులు 50శాతం పైన మార్కులు ఉన్నవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు www.iiphh.org సంప్రదించాలని సూచించారు.

హెచ్ఎండీఏ పార్కుల్లో సీసీ కెమెరాలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 25(నమస్తే తెలంగాణ):హెచ్ఎండీఏ పరిధిలో పార్కుల నిర్వహణ అధ్వాన్నంగా మారిన నేపథ్యంలో.. ఎట్టకేలకు అభివృద్ధిపై దృష్టి సారించారు. ఇప్పటికే గడిచిన ఆరు నెలలు హెచ్ఎండీఏ ఆధీనంలో ఉన్న పార్కుల్లో మౌలిక వసతులు కల్పించారు. ఇందులో భాగంగా వాకింగ్ ట్రాక్‌లు, గ్రీనరీతోపాటు సీటింగ్ ఏరియా, ఓపెన్ జిమ్ పరికరాల ఆధునీకరణ వంటి పనులను చేపట్టారు. తాజాగా కొన్ని పార్కుల నిర్వహణ, పర్యవేక్షణ లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారుతున్నాయి. ఈ క్రమంలో స్థానికుల నుంచి పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమైన నేపథ్యంలో స్పందించిన యంత్రాంగం.. పలు పార్కుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో పార్కుకు రూ.16లక్షలతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టగా, వీటిని బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయనున్నారు.ఆ జాబితాలో సరూర్‌నగర్‌లోని ప్రియదర్శిని పార్కు, నారాయణగూడలోని జీఎస్ మేల్కోటీ పార్క్, కూకట్‌పల్లిలోని పటేల్‌కుంట పార్కు, వనస్థలిపురంలోని సచివాలయ నగర్ పార్కు, జయశంకర్ పార్కు, అభ్యుదయ నగర్ పార్కుతోపాటు పోలీస్‌స్టేషన్ సమీపంలోని హెచ్ఎండీఏ పార్కును సీసీ కెమెరాలతో ఆధునీకరించనున్నారు.

ఎండల తీవ్రతతో వైద్యశాఖ అప్రమత్తం

- కలెక్టర్ అధ్యక్షతన టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు
- అందుబాటులో ఓఆర్ఎస్ ప్యాకెట్లు
- హైదరాబాద్ జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటితో 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక ఇంటర్వ్యూ

సిటీబ్యూరో, ఫిబ్రవరి25(నమస్తే తెలంగాణ): భానుడు క్రమక్రమంగా తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. వాతావరణ మార్పుల కారణంగా ఇప్పటికే ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మార్చి నుంచే ఎండలు దంచికొట్టే ఆస్కారం ఉన్నది. ఇప్పటికే హైదరాబాద్ జిల్లాలో పెరుగుతున్న ఎండలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటి తో 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక ఇంటర్వ్యూ...

టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు..

గత ఏడాదితో పోలిస్తే ఈసారి హైదరాబాద్ జిల్లాలో ఉష్ణోగ్రతలు అధికమయ్యే అవకాశాలు ఉన్నాయి. అందులో భాగంగా ఎండ తీవ్రత నుంచి ప్రజలను కాపాడేందుకు జిల్లాలో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా వ్యవహరించగా, వైద్య, పోలీస్, కార్మిక, సంక్షేమ, మహిళా సంక్షేమం, ఆర్టీసీ మొదలైన శాఖల జిల్లా అధికారులంతా సభ్యులుగా ఉన్నారు. వారంతా ఎప్పటికప్పుడు తమ శాఖల పరిధిలోని ప్రజలకు జాగ్రత్తలు చెబుతుంటారు.

ప్రత్యేక శిక్షణనిస్తున్నాం..

జిల్లాలోని ప్రభుత్వ వైద్యులందరికి 'ఎండతీవ్రత నుంచి ప్రజలకు ఏ విధంగా అవగాహన కల్పించాలి? వారిని వడ దెబ్బ నుంచి ఎలా కాపాడాలనే' అంశంపై ఈనెల 27వ తేదీన శిక్షణ ఇస్తున్నాం. ఈ శిక్షణ తీసుకున్నవారంతా, వాళ్ల పరిధిలో ఉన్న ఆశలు, ఏఎన్ఎంలకు ఇతర సిబ్బందికి శిక్షణనిచ్చి అప్రమత్తం చేస్తారు.

నీటిని ఎక్కువగా తీసుకోండి..

ఎండ ప్రభావం వల్ల మన శరీరంలోని నీరంతా చెమట రూపంలో బయటికి వెళ్తుంది. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండేందుకు రోజుకు 5 లీటర్ల వరకు నీరు తాగాలి. మజ్జిగ తీసుకోవడం మంచిది. శీతల పానియాలు, నూనె వంటలకు దూరంగా ఉండటం ఆరోగ్యానికి శ్రేయస్కరం. వేడిగాలులు లోపలికి రాకుండా మధ్యాహ్న సమయాల్లో కిటికీలు, తలుపులు మూసేయాలి. సాయంత్రం వేళల్లో లోపలి గాలంతా బయటికి వెళ్లేందుకు తెరవాలి. కాటన్ దుస్తులను ధరించడం వల్ల చెమట కాయలకు దూరంగా ఉంటారు.

అందుబాటులో ఓఆర్ఎస్‌లు

జిల్లాలోని పీహెచ్‌సీలు, బస్తీ దవాఖానలు, యూపీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రుల్లో నిత్యం ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంటాయి. ఆశావర్కర్లు సైతం తమ పరిధిలో ఎండ తీవ్రత ఉన్న ఏరియాలను గుర్తించి వారికి మందులు అందిస్తారు. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలోని పీహెచ్‌సీలో వైద్యులను సంప్రదించండి.

ఎక్కువ ప్రభావం వారిపైనా..

ఎండ తీవ్రతతో చిన్నపిల్లలు, 65 ఏండ్ల వయసు పైపడిన వాళ్లు, గుండె జబ్బులు, ఆస్తమా, మానసిక రుగ్మతలతో బాధపడుతున్న వాళ్లు అధికంగా ఇబ్బందులకు గురవుతుంటారు. అవసరమైతే తప్ప బయటికి రాకుండా ఇంటి పట్టునే ఉండటం ఉత్తమం. అదేవిధంగా రోజువారీ కూలీలు, అడ్డమీది కార్మికులు ఎండలో పనిచేయడం ఇబ్బందికరం. ఆ తరహా ఉన్నవాళ్లంతా ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తప్పక నీడ పట్టున ఉండటం సురక్షితం. భవన నిర్మాణ కార్మికులు సైతం నీడ పట్టున ఉంటూ పనులు చేయడం ఉత్తమం. యజమానులు వారి పట్ల దయతో వ్యవహరించి ఎండలో పనిచేయకుండా చూడాలి.

వడదెబ్బ లక్షణాలివే..

- అధిక శరీర ఉష్ణోగ్రత
- బలహీనం, తలనొప్పి
- తీవ్రమైన దాహం, గొంతు ఎండిపోవడం
- చర్మం పొడిగా మారడం
- చెమట పోకపోవడం
- చర్మం ఎర్రగా మారడం
- శ్వాస సమస్యలు,
- గుండె వేగంగా కొట్టుకోవడం
- వికారం, వాంతులు
- మూర్ఛ

మహిళా ఆర్థిక సాధికారతపై 2కే వాకథాన్

సిటీ బ్యూరో, ఫిబ్రవరి 25(నమస్తే తెలంగాణ): ఆర్బీఐ, స్టేట్‌లెవల్ బ్యాంకర్స్ కమిటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో 2కే వాకథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్బీఐ హైదరాబాద్ శాఖ డిప్యూటీ జనరల్ మేనేజర్ టీ జగదీశ్ కుమార్ మాట్లాడుతూ.. ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా మహిళా ఆర్థిక సాధికారతపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. మహిళా ఖాతాదారులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆర్బీఐ, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, మహిళలు, ఉస్మానియా విద్యార్థులతో సహా 400 మంది వాకథాన్‌లో భాగమయ్యారు. కార్యక్రమంలో ఎస్బీఐ హైదరాబాద్ సర్కిల్ సీజీఎం రాజేశ్ కుమార్, ఎస్ఎల్బీసీ కన్వీనర్ ప్రకాశ్ చందర్ బ్రార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో 27న భువనగిరి జోన్‌లో 163 సెక్షన్ అమలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 25(నమస్తే తెలంగాణ): ఈనెల 27న జరుగనున్న వరంగల్, ఖమ్మం, నల్గొండ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రాచకొండ కమిషనరేట్‌లోని భువనగిరి జోన్ పరిధిలో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 (144 సెక్షన్) అమలులో ఉంటుందని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు వెల్లడించారు. నిషేధాజ్ఞలు అతిక్రమించి శాంతి భద్రతలకు భంగం కల్గించే విధంగా ప్రవర్తించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు.

అధికారుల అనాలోచిత నిర్ణయాలతోనే తాగునీటి సమస్యలు

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసి సమస్యను వివరిస్తున్న ప్రైవేటు నీటి ట్యాంకర్ల యజమానులు

దుండిగల్, ఫిబ్రవరి 25: అధికారుల అనాలోచిత నిర్ణయాలతోనే తాగునీటికి సమస్యలు తలెత్తుతున్నాయని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు. నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రైవేటు వాటర్ ట్యాంకర్ ల యజమానులకు జిల్లా గ్రౌండ్ వాటర్ డిపార్ట్మెంట్ నుంచి ఎన్ఓసీ తీసుకొని నీటి విక్రయాలు చేపట్టాలని ఇటీవల సంబంధిత శాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. తెలంగాణ వాల్టా చట్టం 2002 ప్రకారం.. బోర్ బావుల ద్వారా ఇతరత్రా ద్వారా భూగర్భ జలాలను తోడటం, వాటిని డొమెస్టిక్, నాన్ డొమెస్టిక్ అవసరాలకు విక్రయించడం చట్టరీత్యా ఆమోదయోగ్యం కాదని, ఒకవేళ వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని విక్రయించేవారు తప్పనిసరిగా జిల్లా గ్రౌండ్ వాటర్ కార్యాలయం నుంచి ఎన్ఓసీ తీసుకోవాలని స్పష్టం చేశారు. గత రెండు మూడు రోజులుగా నీటిని విక్రయించకుండా ట్యాంకర్లను సీజ్ చేయడంతో మంగళవారం పలువురు ట్యాంకర్ల యజమానులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును ఆయన కార్యాలయం వద్ద కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. దీంతో స్పందించిన ఆయన వేసవికాలం ముదురుతున్న నేపథ్యంలో తాగునీటికి, ఇతర అవసరాలకు, నీటి వినియోగం మరింత పెరుగనున్నదన్నారు. అధికారుల అనాలోచిత నిర్ణయాలతో ప్రజలకు నైతిక కష్టాలు తప్పేలా లేవని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ట్యాంకర్ల యజమానులు, డ్రైవర్ల సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్సీ రాజు సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడారు. ప్రభుత్వానికి, అధికారులకు ముందు చూపు లేకపోవడం వల్ల నీటి కొరత ఏర్పడిందని, బోరు మోటార్లకు మీటర్లు పెట్టాలని ఒత్తిడి తేవడం, ట్యాంకర్లకు అదనంగా ఫీజులు కట్టాలని బెదిరించడం ఏంటని ఆయన అధికారులను నిలదీశారు. కాగా ప్రభుత్వం, అధికారులు కొత్త ఆంక్షలతో తమను వేధిస్తుండటంతో నిజాంపేట కార్పొరేషన్ పరిధిలోని ప్రాంతాలకు నీటి సరఫరాను నిలిపివేసినట్లు పలువురు ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల యజమానులు తెలిపారు.

ప్రత్యేక జీవో ద్వారానే ఎఫ్ఎన్‌సీసీకి స్థలం కేటాయింపు

- అవాస్తవాలతో హైడ్రాకు ఫిర్యాదులు చేశారు..
- ఫిలింనగర్ సొసైటీ కార్యదర్శి కాజా సూర్యనారాయణ

సమావేశంలో మాట్లాడుతున్న ఫిలింనగర్ సొసైటీ కార్యదర్శి కాజా సూర్యనారాయణ

బంజారాహిల్స్, ఫిబ్రవరి 25: సినీ పరిశ్రమ అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం 30ఏండ్ల కిందట ప్రత్యేక జీవో ద్వారా కేటాయించిన స్థలంలో ఎఫ్ఎన్‌సీసీ నిర్మాణం జరిగిందని, పార్కు స్థలం అంటూ కొంతమంది ఈ వ్యవహారంపై హైడ్రాకు ఫిర్యాదు చేశారని, ఇది తప్పు అని ఫిలింనగర్ కోఆపరేటివ్ సొసైటీ కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ అన్నారు. మంగళవారం ఫిలింనగర్‌లోని సొసైటీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఫిలింనగర్ హౌసింగ్ సొసైటీకి చెందిన 95 ఎకరాల స్థలంలో ఫిలింనగర్ ఏర్పాటైందని, ఫిలింనగర్ సైట్-1లో 50 ఎకరాలు, సైట్-2లో 45 ఎకరాలు తాము ప్రభుత్వం నుంచి 1981లో కొనుగోలు చేసి ఏర్పాటు చేశామన్నారు. 1991లో సైట్-2లోని 3.2 ఎకరాల స్థలాన్ని అప్పటి ముఖ్యమంత్రి టి. అంజయ్య సూచన మేరకు గణపతి ఆలయానికి ఇచ్చామని, తర్వాత ఆ స్థలాన్ని టీటీడీకి అప్పగించారన్నారు. తాము ఇచ్చిన స్థలానికి బదులుగా వేరేచోట స్థలాన్ని ఇస్తామని ఇప్పటిదాకా ఇవ్వలేదన్నారు. కాగా, ప్రస్తుతం ఎఫ్ఎన్‌సీసీ ఉన్న 3.20 ఎకరాల స్థలం సైతం ఫిలింనగర్ సొసైటీకి చెందిన రాక్ గార్డెన్ పేరుతో కమ్యూనిటీ హాల్, పార్కు స్థలమని, 1996లో అప్పటి ప్రభుత్వం జీవో నంబర్ 36 ద్వారా సినీ పరిశ్రమ అభివృద్ధిలో భాగంగా రిక్రియేషన్ సెంటర్, కమ్యూనిటీహాల్ నిర్మాణం కోసం కేటాయించిందన్నారు. ఈ స్థలంలో 95శాతం నిర్మాణాలున్నాయని, 1200 గజాల స్థలాన్ని పార్కింగ్ కోసం ఖాళీగా వదిలిపెట్టారన్నారు. వాస్తవాలు ఇలా ఉండగా.. కొంతమంది దురుద్దేశంతో పార్కు స్థలం అంటూ హైడ్రాకు ఫిర్యాదు చేశారని, వారికి చట్టప్రకారం సమాధానం ఇస్తామని తెలిపారు. ఫిలింనగర్ సొసైటీకి చెందిన స్థలాలను ఫైర్ స్టేషన్ కోసం, సబ్ స్టేషన్ కోసం, పోలీస్‌స్టేషన్ కోసం ఉచితంగా కేటాయించామని వివరించారు. తప్పుడు ప్రచారాలను మానుకోకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కుల గణన సర్వేలో వివరాలు తెలపాలి

బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ పిలుపు

సమావేశంలో మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, నాయకులు

సికింద్రాబాద్,ఫిబ్రవరి25: కుల గణన సర్వేలో పాల్గొనని వారు సర్వే వివరాలు తెలపాలని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ పిలుపునిచ్చారు. కుల గణన సర్వేలో భాగంగా మంగళవారం సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని బౌద్ధనగర్, సీతాఫల్ మండి తదితర డివిజన్లలో పర్యటించారు. అనంతరం ఆయన వారాసిగూడలోని జడ్ ఎం ఫంక్షన్ హాల్లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల గణన సర్వేలో పాల్గొని వారు, మళ్లీ ఇప్పుడు తప్పకుండా సర్వే వివరాలు తెలపాలని కోరారు. ఆన్‌లైన్‌లో గాని ఇంటి ముందుకు వచ్చే ఎన్యూమరేటర్లకు గాని వివరాలు తెలిపి సర్వేలో పాల్గొనాలన్నారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్క కుటుంబం కుల గణ సర్వేలో పాల్గొనాలని, ఒకవేళ సర్వేలో భాగంగా అందుబాటులో లేని వారు 040-21111111 నంబర్ కి ఫోన్ చేసి వివరాలు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యూఐ మాజీ ఉపాధ్యక్షులు సృజన్ కుమార్, మాదిరెడ్డి జలంధర్ రెడ్డి, షకీల్ ఖాన్, జామ అనిల్ కుమార్, వాహిదుద్దీన్ లడ్డు, ప్రతాప్, చక్రధర్, బబ్లు, కుద్దూస్, శేఖర్, శోభ, రాధ, కల్పన, కిరణ్, మహేశ్, ప్రేమ్, బాలరాజ్, బ్రహ్మాజీ, నిస్సార్, రమేశ్, జనార్దన్, ఆమెర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే తెలంగాణకు రక్షణ

బీఆర్ఎస్‌లో చేరిన నాయకులతో కార్తీక్‌రెడ్డి తదితరులు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 25: తెలంగాణకు రక్షణ కేవలం బీఆర్ఎస్‌తోనే సాధ్యమని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి అన్నారు. మంగళవారం శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కొత్వాల్‌గూడలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు కార్తీక్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణకు రక్షణ కేవలం బీఆర్ఎస్‌తోనే సాధ్యమని వివరించారు. తెలంగాణ సాధించి పదేళ్ల పాటు అన్ని వర్గాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పాలన అందించిన కేసీఆర్‌ను కాదని, కాంగ్రెస్ పార్టీ అమలుకాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, దీంతో అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగ్గిన బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. తెలంగాణ అభివృద్ధి కేవలం బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్‌తోనే సాధ్యమన్నారు. బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన కొంతమంది ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ న్యాయస్థానంలో పోరాడుతుందని వివరించారు. త్వరలో ఉప ఎన్నికలు వచ్చే అవకాశం ఉండటతో తిరిగి బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుస్తారని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారు చంద్రశేఖర్ యాదవ్, మౌసిన్, ప్రవీణ్‌గౌడ్, అశ్రాఫ్, కార్తీక్‌గౌడ్, సాయిరామ్‌గౌడ్, దేవేందర్‌గౌడ్, సంజయ్‌గౌడ్‌లతో పాటు పలువురు చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బుర్కుంట సతీశ్, మోహన్ రావు, గుంటిచరణ్, మాణిక్‌రెడ్డి, కే శ్రీనివాస్ లతో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారాలు చేస్తున్న ఫుడ్ ఎస్టాబ్లిష్‌మెంట్‌లపై ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారుల తనిఖీలు కొనసాగుతున్నాయి. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని సర్వీ రెస్టారెంట్, బ్లింక్ కామర్స్ ప్రై.లి, సుభాష్‌నగర్‌లోని ఎన్‌కే ఫుడ్ ప్రొడక్ట్స్, దోమలగూడలోని భాయ్ కీ చాయ్, జవహర్‌నగర్‌లోని సహారా బేకర్స్‌లలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఆహార భద్రత నిబంధనలను ఉల్లంఘించిన వ్యాపారస్తులకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు.

నేడు యాదాద్రి అఖండ జ్యోతి రథయాత్ర

అఖండ జ్యోతి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వెంకటరెడ్డి, శ్రీకాంత్, పవన్‌కుమార్, ఉపేందర్‌రావు తదితరులు

కాచిగూడ, ఫిబ్రవరి 25: 31వ అఖండ జ్యోతి యాత్రను బుధవారం బర్కత్‌పుర యాదాద్రి భవన్ నుంచి యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి అఖండ జ్యోతి రథయాత్రను ఉదయం 9:30 గంటలకు వేద పండితులతో ప్రారంభించనున్నట్లు అఖండ జ్యోతి యాత్ర కమిటీ చైర్మన్ సద్ది వెంకట్ రెడ్డి తెలిపారు. సోమవారం యాదాద్రి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ అఖండ జ్యోతి యాత్రను ప్రారంభించడానికి కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండా సురేఖ, ఎంపీ చామల కిరణ్ కుమార్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్యే అనిల్ కుమార్, యాదాద్రి ధర్మకర్త నరసింహమూర్తి తదితరులు హాజరై అఖండ జ్యోతి యాత్రను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ శోభాయాత్ర బర్కత్‌పుర నుంచి ప్రారంభమై మార్చి 1వ తేదీ సాయంకాలానికి యాదగిరిగుట్టకు చేరుకుంటుందని ఆయన తెలిపారు.ఈ యాత్రలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్ రావ్, పవన్ కుమార్, పడాల శ్రీకాంత్,సుదీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులకు సర్టిఫికెట్ల ప్రదానం

సర్టిఫికెట్లు అందజేస్తున్న మేయర్ విజయలక్ష్మి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 25(నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీకి ఎన్నికైన కొత్త సభ్యులకు మంగళవారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగిన నేపథ్యంలో ఎన్నికైన సభ్యులకు జీహెచ్ఎంసీ సెక్రటరీ సత్యనారాయణ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత పాల్గొన్నారు. స్టాండింగ్ కమిటీ సభ్యులుగా గెలుపొందిన 15 మందిలో 10 మందికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, బానోత్ సుజాత, సయ్యద్ మిన్హాజుద్దీన్, అబ్దుల్ వాహేబ్, ప్రవీణ్ సుల్తానా, సలీం, డాక్టర్ అయేషా హుమేరా, మహాలక్ష్మీ రామన్, సీఎన్ రెడ్డి, బురుగడ్డ పుష్ప సర్టిఫికెట్‌లు అందుకున్నారు.

సులభతర అనుమతులకు బిల్డ్ నౌ

- శిక్షణా తరగతులను ప్రారంభించిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి
- వచ్చే నెల 9వ వరకు ఆర్కిటెక్ట్‌లు, ఇంజినీర్‌లకు బిల్డ్ నౌ డీసీఆర్‌పై శిక్షణ



శిక్షణా తరగతులను ప్రారంభించిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

సిటీబ్యూరో, ఫిబ్రవరి 25(నమస్తే తెలంగాణ):ఫాస్ట్ డ్రాయింగ్ స్క్రూటినీ సిస్టమ్ కోసం అధునాతన సాంకేతికతతో కూడిన యూనిఫైడ్ సింగిల్ విండో సిస్టమ్ అమలులో భాగంగా బిల్డ్ నౌ శిక్షణ కార్యక్రమాన్ని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రారంభించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతతో రూపొందించిన ఫాస్ట్ డ్రాయింగ్ స్క్రూటినీ సిస్టమ్ ద్వారా నిర్మాణ అనుమతుల ప్రక్రియ సులభతరం, వేగవంతమవుతుందని మేయర్ తెలిపారు. బిల్డ్ నౌ ద్వారా నగర పౌరులు ఆన్‌లైన్‌లోనే తమ నిర్మాణ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, అనుమతులను త్వరితగతిన పొందవచ్చన్నారు. ఈ విధానం పారదర్శకతను పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తుందని మేయర్ చెప్పారు. పౌరులకు, సంబంధిత అధికారులకు, ఆర్కిటెక్ట్‌లకు, ఇంజినీర్లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ శిక్షణను వినియోగించుకొని బాగా నేర్చుకోవాలని ఆర్కిటెక్ట్‌లు,ఇంజినీర్లకు మేయర్ సూచించారు. జీహెచ్ఎంసీలో బిల్డ్‌నౌ కార్యక్రమాన్ని ప్రారంభించామని, కొత్త ఫీచర్స్‌తో నిర్మాణ అనుమతుల ప్రక్రియ వన్ సింగిల్ ప్లాట్‌ఫాంగా పనిచేస్తుందని కమిషనర్ ఇలంబర్తి, జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్ పేర్కొన్నారు. అప్లికేషన్స్, అనుమతులు పారదర్శకంగా, సులువుగా చీఫ్ సిటీ ప్లానర్ కె.శ్రీనివాస్ ఉంటుందన్నారు. మార్చి 9వ తేదీ వరకు ప్రతిరోజు రెండు సెషన్లలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు 10తేదీ నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమయ్యే అవకాశం ఉందని సీసీపీ తెలిపారు. కార్యక్రమంలో బిల్డ్ నౌ డీసీఆర్ వ్యవస్థపై ప్రాక్టికల్‌గా శిక్షణ ఇవ్వడంతో పాటు భవన అనుమతుల ప్రకియలో క్రియేషన్ ఆఫ్ టెంప్‌లేట్స్, లేయర్లు, వివిధ ఎంటిటీలను రూపొందించడం గురించి అవగాహన కల్పించారు. అడిషనల్ కమిషనర్ శివకుమార్ నాయుడు, జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్, అడిషనల్ సీసీపీలు గంగాధర్, ప్రదీప్, ఆర్కిటెక్ట్‌లు, ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఆర్ఐటీ కళాశాలలో ముగిసిన హ్యాకథాన్

ఏరోప్లేన్లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

దుండిగల్, ఫిబ్రవరి 25: దుండిగల్ లోని మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎల్ఆర్ఐటీ) కళాశాలకు చెందిన ఏరోనాటికల్ విభాగం ఆధ్వర్యంలో ఏరోట్రాన్ పేరుతో రెండు రోజులపాటు నిర్వహించిన హ్యాకథాన్ మంగళవారంతో ముగిసింది. వింగ్స్ అండ్ ఫూఫ్స్, ఐ ట్రిపుల్ఏ సహకారంతో నిర్వహించిన ఈ హ్యాకథాన్ లో విద్యార్థులు తాము రూపొందించిన ఏరోప్లేన్లను ప్రదర్శించారు. మొత్తం 25 గ్రూపులు ఈ ఏరో ట్రాన్ లో పాల్గొనగా.. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఆర్ విద్యాసంస్థల అధినేత మర్రి లక్ష్మణ్ రెడ్డి, కళాశాల సెక్రటరీ, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఏరో నాటికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి సత్యనారాయణ గుప్తను, హ్యాకథాన్ ఆర్గనైజర్ సాయికుమార్ ను అభినందించారు. కార్యక్రమంలో ఎంఎల్ఆర్ఐటీ కళాశాల డైరెక్టర్ దీరేన్ రెడ్డి, ఐక్యూఏసీ విభాగాధిపతి, రాధికాదేవి, అచ్చిరెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయానికి అధిక నిధులు కేటాయించాలి

హిమాయత్ నగర్, ఫిబ్రవరి25: రాష్ట్రంలోని వ్యవసాయ రంగానికి తగినంత బడ్జెట్‌ను కేటాయించి, రైతు సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. 2025-26 రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతలు ఎలా ఉండాలి అనే అంశంపై మంగళవారం హిమాయత్ నగర్ లోని రైతు సంఘం కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వ్యవసాయ నిపుణులు దొంతి నరసింహా రెడ్డి, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ హాజరై మాట్లాడారు. రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గొప్పలు చెబుతున్నాయని, ఇది ఏ మాత్రం వాస్తవం కాదన్నారు. రైతుల మేలు కోసం కాకుండా రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే ప్రభుత్వాలు నిధులు కేటాయింపులు చేయడం వల్ల రైతులు రోజు రోజుకు అప్పుల ఊబిలో చిక్కుకుని విలవిలలాడుతున్నారని ఆరోపించారు. నాసి రకం విత్తనాల వల్ల పంట దిగుబడులు తగ్గిపోవడంతో పంట పెట్టుబడి పెరగడం మూలంగా రైతుల పాలిట శాపంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆధునిక వ్యవసాయంలో విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు, యంత్రాల ధరలను నియంత్రిం చేందుకు మార్కెట్ నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్య క్షుడు ప్రభులింగం, నేతలు ఎస్.వెంకట్ రెడ్డి,జంగయ్య, నరేంద్ర ప్రసాద్, నర్సింహులు, సుధాకర్ గౌడ్, శ్రీశైలం, అమృత, యాదమ్మ, శాంతమ్మ, సంజీవ రెడ్డి, రాజిరెడ్డి, శివయ్య, ఎర్రదాసు, ఉపేందర్, సురేశ్, నర్మద, హరిత, శైలజ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నరసింహా రెడ్డి